

కెరమెరి మండలంలోని కొండిబాగూడ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు



కెరమెరి మండలంలోని కేలికే(కే) గ్రామం నుంచి బైక్‌పై విద్యార్థిని బడికి తీసుకువచ్చిన తండ్రి

# బస్సులు నడవక.. బడికి పోలేక

## అవస్థలు పడుతున్న విద్యార్థులు

- రూట్ లేక కొన్ని చోట్ల.. రూట్ ఉండి మరికొన్ని చోట్ల..
- కాలినడక, సైకిళ్లు, ఆటోలలో బడికి వెళ్లేటోళ్లు ఎంతో మంది
- ఆర్టీసీ అధికారులు దృష్టి పెడితే విద్యార్థులకు ఉపయోగం



కోటపల్లి మండలం ఎదుల్లబంధం నుంచి సిర్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

**మంచిర్యాల జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, నిరుపేద కుటుంబాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఉండి కూడా బస్సులు నడవక ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సు రూట్‌లేని గ్రామాలవారికి ప్రైవేట్ ప్రయాణమే దిక్కవుతున్నది. కొన్ని గ్రామాలకు బస్సు నడిచిన అది స్కూల్ టైమింగ్స్‌తో కుదరక విద్యార్థులు కాలినడకన, సైకిళ్ల మీద వెళ్లాల్సి వస్తున్నది.**

*- మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ), జూలై 2*

- మంచిర్యాల జిల్లాలోని భీమారం మండలం కొత్తపల్లి, మద్దికల్, ఆరేపల్లి, ఎల్కేశ్వరం, ఎల్‌బీపేట్, దాంపూర్, ధర్మారం, నర్సింగాపూర్, బూర్గుపల్లి, కాజీపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలో స్కూళ్లకు వెళ్తున్నారు.
- దండేపల్లి మండలంలో ఒక లింగాపూర్ ఆదర్శ పాఠశాలకు మాత్రమే బస్సు నడుస్తున్నది. దీంతో మిగిలిన పాఠశాలల విద్యార్థులు ఆటోలలో వెళ్తున్నారు. ● కన్నెపల్లి మండల కేంద్రంలోని పాఠశాలకు ముత్తాపూర్ వీరాపూర్ నుంచి వచ్చే విద్యార్థులు కాలినడకన నడుచుకుంటూ వస్తున్నారు. ● కోటపల్లి మండలంలో పారుపల్లి జడ్పీ ఎస్ఎస్ స్కూల్‌కు లింగన్నపేట, పిన్నారం గ్రామాల నుంచి అలాగే సిర్సా జడ్పీఎస్ఎస్‌కు ఎదుల్లబంధం, రొయ్యలపల్లి గ్రామాల నుంచి దేవులవాడ జడ్పీఎస్ఎస్‌కు రాజారం, కావరకొత్తపల్లి, రాపనపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు కాలినడకన వస్తున్నారు. జనగామ మార్గంలో ఉదయం, సాయంత్రం అన్నారానికి బస్ నడుస్తున్నా విద్యార్థుల టైమింగ్స్‌కు అనుకూలంగా నడవడం లేదు. రాజారాం, కొత్తపల్లి గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక బస్ నడవడం లేదు. దీంతో విద్యార్థులు కాలినడకన దేవులవాడ జడ్పీఎస్ఎస్‌కు వెళ్తున్నారు.
- కాసిపేట మండలంలో సోమగూడెం నుంచి కొండాపూర్ మల్కపల్లి మీదుగా గట్రావ్‌పల్లి దాకా బస్సు వేశారు. కాగా ఈ రహదారికి లింక్‌గా ఉన్న కాసిపేట మండలంలోని గ్రామాల విద్యార్థులు కాలినడకన నడుచుకుంటూ వచ్చి సోమగూడెంలో బస్సు ఎక్కాల్సి వస్తున్నది. అలా కాకుండా గ్రామాలను కవర్ చేస్తూ బస్ నడిపించాలని విద్యార్థులు కోరుతున్నారు.
- తాండూర్ మండలంలోనూ బస్సులు లేక చాలా మంది విద్యార్థులు కాలినడకన, సైకిళ్ల మీద పాఠశాలలకు వెళ్తున్నారు.
- ఇలా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా చాలా వరకు విద్యార్థులు కాలినడక, ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లోనే అనేక వ్యయప్రయాసాలకు ఓరుస్తూ ప్రయాణం చేయాల్సి వస్తున్నది. ఆర్టీసీ అధికారులు కొంచెం దృష్టి సారించి బస్సులు రూటు ఉన్న గ్రామాలను గుర్తించి రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



### బస్సు లేక ఆటోలో వస్తున్నాం..

కెరమెరి, జూలై 2 : మాది కెరమెరి మండలంలోని కేలికే గ్రామం. నేను మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న. మా గ్రామానికి బస్సుసౌకర్యం లేకపోవడంతో ఆటోలో ప్రతి రోజూ వచ్చి పోతున్నాం. మా గ్రామం నుంచి చాలా మంది ఆటోలోనే బడికి వస్తున్నారు. ఆటోకు నెలకు 600 రూపాయల చొప్పున చెల్లిస్తున్నాం. ప్రభుత్వం మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

*-ముండే సాయినాథ్, కేలికే గ్రామం, కెరమెరి మండలం*



### నెలకు రూ.700 ఆటో చార్జీలు..

కెరమెరి, జూలై 2 : నేను కెరమెరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నా. మాది అంతాపూర్. మా ఊరి నుంచి చాలా మంది విద్యార్థులు ఇదే పాఠశాలకు వస్తున్నారు. మా గ్రామంలో ఉన్నత విద్య లేకపోవడంతో నేను మండల కేంద్రంలోని పాఠశాలకు వస్తున్నాను. మా గ్రామానికి ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందిగా మారింది. ప్రతి నెలా రూ.700 ఆటో చార్జీలు చెల్లించి వచ్చి పోతున్నాం.

*- దుర్గం లావణ్య, పదోతరగతి, అంతాపూర్, కెరమెరి మండలం*



కోటపల్లి మండలం రాజారం, కావర కొత్తపల్లి గ్రామాల నుంచి దేవులవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు



బస్సు సౌకర్యం లేకపోవడంతో కెరమెరి మండలంలోని కొండిబాగూడ గ్రామం నుంచి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

బస్సు సౌకర్యం లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ఐదో తరగతి వరకు స్థానికంగా చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆపై చదువులకు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తున్నది. ప్రభుత్వం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆసిఫాబాద్ వంటి జిల్లాలో ఐదో తరగతి తర్వాత చదువులు మానేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో దాదాపు 1100 పైచిలుకు గ్రామాలు ఉంటే.. ఆర్టీసీ నడుపుతున్న బస్సులు మండల కేంద్రాల వరకే ఉండడంతో గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సిర్పూర్(యూ), లింగాపూర్ వంటి మండల కేంద్రాలకు కూడా బస్సులు సక్రమంగా వెళ్లకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని గిరిజన విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తున్నది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


### ఐదేళ్ల నుంచి నడుస్తున్నా..



కోటపల్లి, జూలై 2 : మా ఊరైన ఎదుల్లబంధం నుంచి ఐదేళ్లుగా పొరుగున ఉన్న సిర్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 4 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నా. నేను పదో తరగతి చదువుతున్నా. మా రూట్‌లో వచ్చే బస్ ఎప్పుడు వస్తదో, ఎప్పు డు రాదో అర్థం కాదు. వర్షం పడ్డప్పుడు మా ఊరి నుంచి మా అమ్మ, నాన్నలు వచ్చి వాగు దా టించేవారు. ఇప్పుడు బ్రిడ్జి నిర్మా ణం పూర్తయి వాగు దాటే కష్టాలు తొలగినా మాకు బస్సు సౌకర్యం లేదు. ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లి రావడం ఇబ్బందిగా ఉన్నది.

*-గంట అఖిల, 10వ తరగతి, ఎదుల్లబంధం, కోటపల్లి*

### రోజూ 4 కిలోమీటర్లు నడవాలి..



కోటపల్లి, జూలై 2 : మాది ఎదుల్లబంధం గ్రామం. నేను ఏడవ తరగతి చదువుతున్నా. మేం చదువుకోవాలంటే ప్రతి రోజూ నడవాల్సిందే. సిర్సా గ్రామంలోని పాఠశాలకు చేరుకోవాలంటే మా ఊరి నుంచి 4 కిలోమీటర్లు నడవాల్సిందే. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. సమయానికి బస్సు లేకపోవడంతో పై చదువుల కోసం తప్పని పరిస్థితుల్లో వెళ్లి చదువుకుంటున్నాం. మళ్లీ తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు కూడా ఇబ్బందులు పడుతూ నడుచుకుంటూ వస్తున్నాం.

*-ఎలుకుచ్చి మల్లేశ్, 7వ తరగతి, ఎదుల్లబంధం, కోటపల్లి*

# ఉద్యోగాలను భర్తీ చేయాలి

- నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి ● కాంగ్రెస్ సర్కారుకు బీజేపీ డిమాండ్ ● తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా



వాంకిడి: తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు

వాంకిడి / పెంచికల్‌పేట్, జూలై 2: ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి, నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ యువమోర్చా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు సుచిత్ డిమాండ్ చేశారు. మంగళవారం వాంకిడి తహసీల్ కార్యాలయం ఎదుట బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పూటకో మాట చెప్పి మోసం చేస్తున్నదని ఆరోపించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 1:100 ప్రకారం క్వాలిఫై అవకాశం ఇవ్వాలని, గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని పోలీస్ నియామకాల్లో 46 జీవో వెంటనే రద్దు చేయాలని, జాబ్స్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ రోహిత్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల నాయకులు వికాస్, నరేశ్, వేణు, శివకుమార్, బాపూజీ దరి కార్తిక్, క్రిమిల్ల మహేశ్, బాల రాజు శ్రీకాంత్, దుర్గం అక్షయ్ తదితరులున్నారు.



పెంచికల్‌పేట్: తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

### పెంచికల్‌పేట్‌లో..

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర సర్కారును డిమాండ్ చేస్తూ పెంచికల్ పేట్ తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ గోపాల్‌కు బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలే సంతోష్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువకులు పాగిడే కాంతారావు, పల్లెం పురుషోత్తం, డోకె బాపూజీ, తెలిగే రమేశ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందాలి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ● ప్రజాప్రతినిధులకు సన్మానం



ప్రజాప్రతినిధులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

హాజీపూర్, జూలై 2 : పదవిలో ఉన్నా లేకున్నా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మన్ననలను పొందాలని ప్రజాప్రతినిధులకు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సూచించారు. హాజీపూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) మందపెల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ఎంపీటీసీలు జాడి వెంకటేశ్, సోగాల సుజాత, గడ్డం లతాశ్రీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు నయీం పాషా పదవీ కాలం నేటితో ముగియనుండడంతో వారిని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ హాజీపూర్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పడ్తన్‌పల్లి మాజీ సర్పంచ్ గోళ్ల శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ మందపెల్లి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్ రావు, నాయకులు సోగాల కిష్టయ్య, గడ్డం తిరుపతి యాదవ్, బేతు రవి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న అంజనీపుత్ర చైర్మన్, డైరెక్టర్లు

# 'అంజనీపుత్ర'కు బెస్ట్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీ అవార్డు

మంచిర్యాలటౌన్, జూలై 2 : మంచిర్యాలలోని అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థకు బెస్ట్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీ అవార్డు లభించింది. స్విఫ్ట్ అండ్ లిఫ్ట్ మీడియా అండ్ టెక్ ఎక్సలెన్సీ యేటా వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ సేవలందిస్తున్న సంస్థలకు తెలంగాణ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు అందజేస్తున్నది. 2024 సంవత్సరానికి గా నూ బెస్ట్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీగా అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ సంస్థను ఎంపిక చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ నీలేశ్‌సాబే, సినీనటి భూమికా చావ్లా చేతులమీదుగా సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి, డైరెక్టర్లు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మాట్లాడుతూ 2017లో స్థాపించిన అంజనీ పుత్ర ఎస్టేట్స్ అనతి కాలంలోనే తెలంగాణలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీగా ఎదిగిందని, హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే పరిమితమైన ఫాంల్యాండ్ కల్చర్‌ను మొదట కోల్‌బెల్ట్ ఏరియాకు పరిచయం చేసిందని, 5 వేల మందికి పైగా కస్టమర్ల ఆదరాభిమానాలు పొందామని తెలిపారు.

# చెట్లతోనే మానవాళికి మనుగడ

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి ● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, జూలై 2 : చెట్లతోనే మానవాళికి మనుగడ అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. కోటపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమంలో భా గంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఒక్కో మొక్క నాటి అది పెరిగే వరకూ బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వివరించారు. ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున అందజేసి వాటిని నాటేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కల వద్ద ఫొటోలు దిగారు. కోటపల్లి ఎస్సీ హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లను నిర్మించాలని ఎంపీపీ మంత్రి సురేఖ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, అడిషనల్ డీఆర్డీవో దత్తారాం, ఎంపీపీ మంత్రి సురేఖ, ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఎంఈవో తిరుపతి రెడ్డి, ఏపీవో బాలయ్య, ఈసీ నాగేందర్, ఎంపీఎం వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, కొట్టె శంకర్, అంజన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆంథ్రాజ్ రాజశేఖర్, సీఆర్పీ సంపత్, టీఏలు చిరంజీవి, సంపత్‌రెడ్డి, తనుగుల సతీశ్, రాళ్ల బండి మధూకర్, సరిత పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679